# పగ

ఊరికి బయట పాడుబడిన సత్రం. ముందు విశాలమైన వసారా, పక్కనే జుత్తు విరబోసుకున్న భూతంలా శాఖలు విప్పుకొన్న రావిచెట్టు. నడివాకిలికి మధ్యగా చిన్న గుడ్డి దీపం వెలిగే స్థంభం – అక్కడి వాతావరణ మిది.

అప్పటికి పదకొండు గంటలయి ఉంటుంది. ఇంకా ఓ మూల చాపమీద కూర్చొని గుమాస్తా ఏదో రాస్తూనే ఉన్నాడు. అతని జీవితమంతా ఈ సత్రంలోనే గడిచిపోయింది.

దూరంగా నక్కల అరుపు వినిపించింది. దగ్గర్లో ఎవరిదో మనిషి అలికిడి అయింది. వెనువెంటనే తలుపు తెరుచుకొంది. ఒక్కసారి తుళ్ళిపడి గుమాస్తా ముక్కుమీద కళ్ళజోడు కిందనుంచి గుమ్మంవేపు పరికించాడు. మరోసారి మీదినుంచి పరికించాడు.

సన్నగా రివటలాఉన్న వ్యక్తి లోనికొచ్చాడు. వస్తూనే గుమాస్తాని చూస్తూ అన్నాడు :

"ఇదేనా కన్యకాపరమేశ్వరీ సత్రం?"

"చిత్తం. తమరు...."

"ఓ బాటసారిని లెండి. తొందరపనిమీద వచ్చాను. ఇక్కడి గది ఖాళీగా ఉందా!"

యువకుడి ముఖంలో ఆతృత, ఆందోళన కన్పిస్తోంది.

"ఉండకేం చేస్తుందండీ – ఇంత పెద్ద సత్రంలో?"

"ఉన్నదన్నమాట?"

"చిత్తం"

"చూడండి, నాకు త్వరగా గది చూపండి. బాగా ఆకలిగా ఉంది. భోజనం ఏమైనా...."

"ఏర్పాటు చేయిస్తానండి"

"అన్నట్టు ... ముందుగా స్నానం చెయ్యాలి"

"మొదట బట్టలు మార్చుకోండి. నూతికి దోవ చూపిస్తాను."

"వేన్నీళ్ళు దొరకవా? – చలి నరాల్ని కొరికేస్తోంది"

"అయితే పొయ్యి రాజేయిస్తాను బాబూ" – అని "ఒరేయ్ బుచ్చీ! – పొయ్యి రాజెయ్యిరా" అని ఓ గావుకేక పెట్టాడు. రోజంతా అలిసిపోయి అప్పటికే గుర్రుపెట్టి నిద్రపోతున్న బుచ్చిగాడు ఈ కేకతో లేచి విసుక్కొంటూ పనికి ఉపక్రమించాడు.

"గుమాస్తాగారూ, ఈ సత్రంలో ఇంకా ఎవరున్నారు?"

"అదేమిటో ఈ రాత్రి ఎవ్వరూ లేరండి. నేనూ వంటవాడూ మాత్రం మిగిలాం. ఊరికి దూరమేమో ఇప్పటివరకూ భయంతో గుండె బితుకుబితుకులాడుతూనే ఉంది. రోజులు మనవికావు చూడండి. మీరు వచ్చారు. కొండంత ధైర్యం వచ్చింది."

ఇటువంటి సమయాల్లో అసలు విషయంతోపాటు ముఖస్తుతి జతచేస్తూండడం గుమాస్తాకి అనుభవం ద్వారా వచ్చేసింది.

"అయితే ఇంతవరకూ ఇటువేపెవరూ రాలేదన్నమాట!"

"చిత్తం, ఎవ్వరూ రాలేదండి."

"సరేలెండి" అని అంతలో ఏదో ఆలోచించుకుని "జెయిల్‌కి ఈ సత్రం ముందు నుంచే వెళ్ళాలి కాదూ? – అక్కడినుంచి రావాలన్నా?"

"అదేమిటండీ అలా అడుగుతారు. ఆ దూరంగా కన్పించే ఎత్తు గోడల వెనకనే సెంట్రలు జెయిలు" అన్నాడు గుమాస్తా.

"ఇటు వేపు నుంచి ఎవరూ పోలేదని మీకు గట్టిగా గుర్తేనా?"

"నేను చూసినంతవరకూ రూఢే. కాని మీరింతగా అడగడానికి కారణం నేను తెలుసుకోవచ్చా బాబూ."

"మరేం లేదు చిన్న పనివుంది. ఆఁ ... ఇప్పుడు టైమెంతయి ఉంటుంది."

"ఇప్పుడిప్పుడే – మీరు మరో క్షణంలో వస్తారనంగా గంట స్తంభం పదకొండు కొట్టడం విన్పించింది."

యువకుడు వీధివేపు ముఖం తిప్పాడు. బయట అంతా చీకటి గాఢాంధకారం. కీచురాళ్ళ రొదలు విపరీతంగా ఉన్నాయి. కప్పల బెకబెకలు మిన్నుముట్టాయి. ఉండుండి నక్కలు అరుస్తున్నాయి. ఊరికి చివరేమో అంతా 'జిమ్' మంటూ భయంకరంగా ఉంది.

"ఈపాటికి వదిలేసి ఉండాలి. ఇక వచ్చేస్తూంటాడు" అని గొణుక్కున్నాడు.

"గుమాస్తాగారూ" అన్నాడు బిగ్గరగా. గుమాస్తా కూర్చొన్నవాడల్లా ఈ పిలుపుకి తుళ్ళిపడ్డాడు.

"భోజనానికి త్వరగా ఏర్పాటు చేయించండి."

"చిత్తం. ఏర్పాట్లు జరుగుతున్నాయండి"

"మరో భోజనం కూడా"

"ఇంకొకరు కూడా వస్తారాండి?"

"ఊఁ మరో విషయం, స్నానానికి ఏర్పాట్లు, గది ఏర్పాట్లూ, అన్నీ నాకు చేసినట్టే చేయించండి. పోనీ, ఇద్దరికీ ఒకే గదిలో మంచాలు వేయిస్తే బావుంటుంది. అప్యాయంగా ఎన్నో విషయాలు మాట్లాడుకోవచ్చు. చూడండి. మంచాలు రెండూ ఒకే గదిలో దగ్గరగా వేయించాలి."

గుమాస్తాకి ఈ మాటల్తో ఎన్నో విషయాలు అర్థమయి పోయాయి. అతని పెదవులు రెండూ గుండ్రంగా వంపు తిరిగాయి. చిరునవ్వు నవ్వుకొన్నాడు. "మీకు ఈ మధ్యనే పెళ్లయిందాండి?" మెల్లిగా అడిగాడు.

"ఏం? – అలా అడిగారు" –

"మంచాల విషయంలో అంత జాగ్రత్తగా ఉంటే"

నవ్వుకొన్నాడతను. "మీకు తెలీదులెండి ఆ బాధ. ఎన్నాళ్ళో ఒకరి ముఖం మరొకరు చూడకుండా ఉన్న తర్వాత – ఇన్నాళ్ళతర్వాత – ఇవాళ కల్సుకోబోతున్నామంటే ఉండే ఆనందం అంతా ఇంతా కాదు. అయినా నాకింకా పెళ్ళికాలేదు."

"మరి ప్రేమ వ్యవహారమా?"

"ఆ... ప్రేమా? – అవును ఒక విధంగా ప్రేమ వ్యవహారమే. అవ్యాజమైన ప్రేమ" – కలలుకంటూ అన్నాడు యువకుడు.

"లోకం ఎంత పిచ్చిదయిపోయింది!" అని విస్తుపోయాడు వృద్ధుడు. ఏర్పాట్లు గావించేందుకు లోనికి పోయాడతను.

యువకుడు గాఢాంధకారంలోకి చూస్తూ నిలబడిపోయాడు అచేనతంగా.

"బాబూ"

తుళ్ళిపడ్డాడు. "ఓహ్! మీరేనా? ఎవరో అనుకున్నాను. ఏం కావాలి?"

"తమ పేరు?"

"రాఘవరావు"

"ఊరు?"

"విశాఖపట్నం"

"వ్యాపారం?"

"ఏదో చిన్న ఉద్యోగంలే"

ఒక్కొక్కటే పుస్తకంలో రాసుకొంటున్నాడు గుమాస్తా.

"తమ తండ్రిగారి పేరు"

"రంగడు. అదే రంగారావు"

"ఆయనగారి ఉద్యోగం"

"అదెందుకులెండి"

"ఆ విషయాలన్నీ ఇక్కడ రాసుకోవాలండి. అది ఇక్కడి ఆనవాయితీ"

"పోనీయండి. ఆ విషయం ఎందుకు?"

"చెప్పితీరాలి బాబూ! – ఇక్కడి కట్టుబాట్లవి. నన్ను క్షమించాలి"

"అయితే రాసుకోండి – నా తండ్రి దొంగ!" –

తెల్లబోయాడు గుమాస్తా. చేతిలో కలం జారిపోయింది.

యువకుడి ముఖం పేలవమైంది. పెదవులు వంపుతిరిగాయి.

"నాతండ్రి దగాకోరు. జేబులు కత్తిరించడం అతని వ్యాపారం."

"ఆఁ!"

"ఎందుకలా తెల్లబోతారు. రాసుకోండి"

"వింటూంటే ఆశ్చర్యం కలుగుతోంది" తెప్పరిల్లి నూతులోంచి వినిపించే పాటి గొంతుకతో అన్నాడు వృద్ధుడు.

"ఒక్క సంగతి అడుగుతాను చెప్పండి. మీరిక్కడ గుమాస్తాగా బ్రతకడానికి కారణం ఏమంటారు?"

"ఏమి చెప్పను బాబూ! – బండెడు సంసారం. పొద్దుగడవడం అపురూపం. ఇదే సంసారానికి ఉపాధి – ఇంతకూ పరిస్థితులు అల్లాంటివి"

"అలాంటి పరిస్థితులే నా తండ్రిని దొంగను చేశాయి." – మాటలు ఆగి ఆగి వస్తుంటే యువకుని ముక్కు ఎరుపెక్కింది. ఏదో అవ్యక్తమైన ఉత్తేజం అతణ్ని చలింపజేస్తోంది.

నిట్టూర్చాడు గుమాస్తా. "కావచ్చునండి. జీవితం విదేశీ భాష లాంటిది. నైమిత్తిక ప్రపంచంలో పడి కొట్టుకొంటున్న మనలాంటి వాళ్ళకి ఆ భాష ఉచ్చారణ అర్థంకాదు. సరేలెండి. ఇప్పుడాయన ఎక్కడ ఉంటున్నారో సెలవిస్తారా?" –

"ఈ ఉదయం వరకూ జెయిల్లో. ప్రొద్దుటే విడుదల చేసి ఉంటారు"

"జైల్లోనా!"

"దొంగలు ఉండేచోటు అదేగా?– రాత్రి అయేవరకూ ఆగి ఇటు వస్తాడని తెలిసింది. ఇప్పుడు పదకొండున్నరయి ఉంటుంది. మరో కొద్ది క్షణాల్లో ఇక్కడికి వస్తాడు. నా తండ్రిని ఇదే స్థలంలో కల్సుకుంటాను."

గుమాస్తా మాట్లాడలేదు. అతని మనస్సు వివిధమైన అనుభూతులకు లోనవుతోంది. అతని భయాన్ని గ్రహించి నవ్వుకున్నాడు.

"నా తండ్రి హత్యలు చేస్తాడని భయపడుతున్నారా మీరు? ఇరవైయేళ్ళు ఆ ఘోర

నరకాన్ని అనుభవించి వచ్చిన అతనింకా అటువంటి నీచపు పని ఎందుకు చేస్తాడూ? మీరే చెప్పండి."

"చెయ్యలేరు బాబూ! ఎంతటి వారినైనా విధి లొంగదీస్తుంది. మీరు తండ్రిని చూస్తే పోల్చుకోలగలరా?"

ఈ మాటలు యువకుడి మీద ఎంతగానో పనిచేసాయి. ఏదో తనలో తానే గొణుక్కున్నాడు.

"పోల్చుకోలేను. ఎలా పోల్చుకో గలను? ఆయన జెయిలుకి పోయి ఇరవై సంవత్సరాలయి ఉంటుంది. ఇప్పుడు నా వయస్సెంతనుకుంటున్నారు?"

"ఇరవై పైన ఉంటాయేమో?"

"ఇరవై రెండు. అంటే. అప్పటికి తల్లి ఒడిలో ఉన్నాను. నాన్న నేరం చేసి జైలుకి పోవడం అమ్మ చెప్పగా మాత్రమే విన్నాను. పెద్దయ్యాక ఎన్నోసార్లు ఆయనను కలుసుకోవాలనుకున్నాను. కాని అధికార్లు ఒప్పుకోలేదు. హత్యా నేరం చేసిన వ్యక్తితో మాట్లాడడానికి వీల్లేదన్నారు"

"ఆయన అప్పట్లో చేసిన నేరం ఏమిటి?"

"హత్య?"

దిమ్మెరపోయాడు గుమాస్తా.

"హత్య అనగానే గుండె బాదుకున్నారు కాని, ఒక మనిషి తన మానవత్వం కోల్పోయి మరో మానవుణ్ని హత్య చెయ్యవలసిన పరిస్థితి ఎందుకు వస్తుందో ఆలోచించారా? ఎంత మూర్ఖుడైనా, ఎంత చదువురాని పశువైనా, ఎన్నో పరిస్థితుల ప్రోద్బలం వల్ల కాని హత్యకు పూనుకోడు."

"అదీ నిజమే"

"కాని మానాన్న హత్య చెయ్యలేదు."

ఆశ్చర్యపోయాడతను. "ఇప్పుడే అన్నారుగా చేశారని?"

"చేశారని అనలేదు. ఆ నేరం క్రింద జైలుకి పంపించారని మాత్రమే అన్నాను. కాని ఆయన నిర్దోషి."

వింటూ కూర్చున్నాడు గుమాస్తా. అతని నోరు పెగలలేదు.

"ఇరవై ఏళ్ళక్రితం నాగభూషణం అనే జమీందారు, ఒక వేశ్యని ఒకనాటి రాత్రికి రాత్రి హత్య చేశాడు. తప్పించుకోడానికి వీల్లేక విలవిలలాడుతున్న సమయంలో అదే ఇంటికి నా తండ్రి దొంగతనానికి పోవడం జరిగింది. అంతే! హత్యానేరం అతనిమీదకు తోసేశాడు. డబ్బూ, పలుకుబడి ఉన్నదిగా? ఊరంతా అతని ప్రక్కనయారు. ఇదివరకే ఎన్నోసార్లు పోలీసుల దృష్టిలో పడ్డ రంగడు హంతకుడయ్యాడు. తర్వాత అతనికి ఇరవై ఏళ్ళు శిక్ష వేసింది గుడ్డి న్యాయస్థానం."

వింటూంటే అతని కళ్ళు చెమర్చాయి.

"దొంగంటే భయపడ్డారుగాని, దొంగల్లోనే ఇంకా మానవత్వం, నిజాయితీ ఉన్నాయి. ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడయినా న్యాయానికి తలొగ్గుతారు. కాని నీచత్వం, రాక్షసత్వం ఈ నాగభూషణం లాంటి పెద్ద మనుష్యుల్లోనే కరుడుగట్టుకుపోయి ఉన్నాయి."

అతని ఆవేశాన్ని చూసి దిగ్భ్రాంతుడయాడు వృద్ధుడు, కాని ఆగలేదతను. అలా చెప్పుకుపోతున్నాడు.

"అప్పటినుంచీ తల్లి చేతుల్లో ఎన్నో కష్టాలు పడి పెరిగాను. ఈ ఒడుదుడుకుల్ని తట్టుకుని ఈ జీవితాన్ని సాగిస్తున్నాను. ఏదో లెండి, కష్టాలుపడడానికే మనం ఈ లోకంలోకి వచ్చాం. కష్టాలు పడుతున్నాం. కాని 'సుఖం' అనేది జీవితంలో ఎప్పుడో ఒక్కసారే ఉంటుందని నా అభిప్రాయం. అది ఈనాడే అనుభవిస్తున్నాను. ఇవాళ నా తండ్రిని కలుసుకుంటాను. ఇవాళ్టివరకూ చూడని తండ్రిని ఇప్పుడు చూస్తాను. నాకింకేం కావాలి?"

నిట్టూర్చాడు గుమాస్తా. ఇదంతా చెప్తూంటే రాఘవరావుకి కూడా కళ్ళనీళ్ళు తిరగాయి. వాటిని తుడుచుకుని మెల్లగా కుర్చీలో కూలబడే సమయంలో హఠాత్తుగా తలుపు తెరుచుకొని లోనికి ఒక వ్యక్తి పరుగెత్తుకు వచ్చాడు.

విచిత్రంగా అతనివేపు చూస్తూ నిలబడిపోయారిద్దరూ.

పొడవుగా నల్లటికోటు వేసుకొన్నాడు వచ్చిన వ్యక్తి. బలిష్టంగా ఉన్నాడు. బొద్దుమీసాలూ, క్రూరత్వాన్ని సూచించే పెదవులూను. మనిషి యావత్తూ భయంతో వణికిపోతున్నాడు. శక్తినంతా కూడగట్టుకొని పరుగెత్తుకు రావడం వల్ల ఆయాసంతో క్షణకాలం మాట్లాడలేకపోయాడు. పెదవులు అక్కడక్కడ రక్తాన్ని చిమ్మాయి. ముఖం పూర్తిగా తెల్లబడి, పేలవంగా ఉంది..వస్తూనే ఇద్దర్నీ తేరిపార జూసి "లోపల దాక్కుంటాను. ఎవరయినా వస్తే దయచేసి లేడని చెప్పండి" అని లోనికి పారిపోయాడు. అతనటు వెళ్ళాడో లేదో మరోవ్యక్తి అక్కడికి వచ్చి పడ్డాడు. వయస్సు సుమారు నలభై వరకూ ఉంటాయి. మాసిన గడ్డం, లోతైన కళ్ళూ, చాలావరకూ కృశించిన శరీరంతో నీరసంగా ఉన్నాడు. కాని ఆవేశంతో మనిషి ఊగిపోతున్నాడు. చేతిలో బాకు తళాతళా మెరిసి పోతోంది. అతన్ని చూస్తూనే గావుకేక పెట్టాడు గుమాస్తా.

"చెప్పండి. ఇటువేపు ఎవరైనా వచ్చారా?" అన్నాడతను గుమాస్తా వేపు చూస్తూ.

గుమాస్తా కాస్సేపు తడబడ్డాడు. ఏం చెప్పడానికీ తోచలేదు. అతని చేతిలోని బాకు మాటిమాటికీ అతన్ని భయపెట్టసాగింది. చివరకు గుండె దిటవుపర్చుకొని "ఎటువంటి మనిషి?" అన్నాడు.

"నీచత్వం, కుళ్ళు, దుర్మార్గం గూడుకట్టుకొని ఉన్న మనిషి. అసలువాడు మనిషికాడు – రాక్షసుడు. ఎటువంటిపనినైనా నిశ్చింతగా చేసే దుర్మార్గుడు... ఎక్కడవాడు?" గర్జించాడు.

"ఎవరండీ మీరు?" రాఘవరావు అడిగాడు.

"ఎవరైతే నీకేం?" కటువుగా జవాబు.

"హత్య చేయడం మహాపాపం కదూ?"

నవ్వాడు నూతనవ్యక్తి. "మరి నా ఇరవై యేళ్ళ జీవితాన్ని దోచుకోవడం పాపం కాదూ? అన్యాయంగా నా మీద హత్యానేరం మోపి నన్ను జెయిలుకి పంపడం పాపం కాదూ? ఇన్నాళ్ళ తర్వాత ఇవాళ్ళ నన్ను జైలునుంచి విడుదల చేస్తే ఎక్కడికి పోను? నా భార్య ఇప్పుడెక్కడ ఉందో? - నా కొడుకు - అప్పుడు రెండేళ్ళవాడు - ఇప్పుడెక్కడ కనిపిస్తాడు?" ముఖానికి చెయ్యి అడ్డుపెట్టుకు ఏడ్చాడతను. అంతలో ఉత్తేజితుడై రాఘవరావు వేపు తిరిగి "మీకు తెలీదులెండి ఈ నాగభూషణం మీద నాకు ఉన్న పగ. నాలోని ప్రతీ అణువూ ఈ ఇరవై ఏళ్ళుగా ఎంత బాధపడిందో. అలాగే వీడూ, వాడి కుటుంబం కుమిలి కుమిలి చావాలి, ఎక్కడ నాగభూషణం?" మళ్ళీ అరిచాడు.

ఇదంతా వింటున్న రాఘవరావుకి ఓ పక్క దుఃఖం, మరోపక్క ఆనందం పొర్లుకొచ్చాయి. వాళ్ళంతా కళ్ళు చేసుకొని తండ్రిని చూశాడు. అతని పెదవులు అప్రయత్నంగా "నాన్నా" అంటున్నాయి! కాని ఇదంతా గమనించే పరిస్థితిలో లేడతను. గుమాస్తావేపు గిరుక్కున తిరిగి "నన్ను మోసం చెయ్యడానికి ప్రయత్నించకండి. ఈ చుట్టుపక్కలంతా బయలు ప్రదేశం, ఎక్కడికైనా పారిపోతే నాకళ్ళ పడేవాడు. బహుశా ఇక్కడే దాక్కొని ఉంటాడు. అంచేతే నన్ను దాటిపోగలిగాడు. త్వరగా చెప్పండి అతనెక్కడ ఉన్నాడో?"

గుమాస్తా తడబడ్డాడు. చెప్పెయ్యడానికి ఉద్యుక్తుడయాడు. రాఘవరావే అతన్ని ఆపాడు.

"కాస్త విశ్రాంతి తీసుకోండి. ఇక్కడికి రాకుండా ఎక్కడికీ తప్పించుకుపోలేడు వాడు" అన్నాడు రాఘవరావు.

"పగ తీరనిదే నాకు విశ్రాంతి లేదు" అని గొణుక్కున్నాడతను. తర్వాత తనతో అంత సౌమ్యంగా మాట్లాడే రాఘవరావు వేపు విస్మయంతో చూశాడు. అంత సౌమ్యమైన మాట, హృదయంలో మార్దవత్వం, చూపులో వెన్నెల కురిపించినవారు అంతవరకు అతనికి తటస్థపడలేదు పాపం!

"నేను దొంగని తెల్సా?" అన్నాడు అతని దగ్గరగా వచ్చి.

"తెలుసు"

"నాతో ఇంత మామూలుగా మాట్లాడడానికి నీకు భయంలేదూ?"

"తండ్రితో మాటాడడానికి కొడుకు జంకుతాడా?"

"ఏమిటో పిచ్చి" అనుకొన్నాడతను. కిటికీలోంచి బయటికి చూశాడు. "ఈ ప్రపంచాన్ని చూసి ఇరవై ఏళ్ళయింది. ఈ బయటి ప్రపంచం ఎంత విశాలంగా ఉంది? ఇక్కడ కావలసినంత స్వేచ్ఛ" అనుకున్నాడు.

ఇంతలో గుమాస్తా పుస్తకం పట్టుకు తయారయాడు.

"బాబూ!"

తుళ్ళిపడ్డాడతను. "ఏం వచ్చాడా అతను!"

"వస్తారండి. కాని తమపేరు?"

"నన్ను మళ్ళీ పోలీసులకి అప్పగిద్దామనా – నేనిప్పుడే వాళ్ళ చేతుల్లోంచి వస్తున్నాను."

"అందుక్కాదండి. పుస్తకంలో రాసుకోవడం ఇక్కడి పద్ధతి."

"అయితే రాసుకోండి. నాపేరు రంగడు. ఇప్పటివరకూ నా ఉద్యోగం దొంగతనం. ఇకమీదట ... ఇకమీదట ... ఆ పని మానేస్తాను."

"చిత్తం"

"ఇదంతా రాసుకుంటున్నారేమిటి?"

"లేదండి."

"ఏమిటి రాశారు."

"పేరు – రంగడుగారు. ఉద్యోగం, కంట్రాక్టరు" గుక్క తిప్పుకోకుండా నవ్వాడు రంగడు.

"దొంగని రాస్తే నామోషి కాబోలు, భేష్! అయితే నేనీ సత్రంలో ఉన్నంత కాలం కంట్రాక్టరునన్నమాట! అయితే నాకేగది ఇచ్చారు?"

"అయిదో నెంబరు గది. ఇలా వెళ్తే కుడివేపు రెండోగది."

"సరే, పోయి పడుకొంటాను. నాగభూషణం రాగానే లేపండి" అంటూ వెళ్ళిపోయాడతను.

గాలివాన ఒక్కసారి వెలిసినట్లయింది. ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు ఇద్దరూను. గుమాస్తా ఇంకా భయంతో వణికిపోతూనే ఉన్నాడు. రాఘవరావూ మాట్లాడే స్థితిలో లేడు. రంగడు లోనికి వెళ్ళగానే మెల్లగా అతనూ అటువేపు వెళ్ళాడు.

ఎంతోసేపు రాయిలా నిలబడిపోయాడు గుమాస్తా. తర్వాత మెల్లగా తేరుకొని వసారాలోని దీపం ఆర్పేసి లోనికి పోయాడు.

చర్చి ఒంటిగంట కట్టింది.

రెండు క్షణాలు సత్రపు ఆవరణ నిశ్శబ్దమై పోయింది.

ఎక్కడో గుడ్లగూబ అరిచింది. కుక్క మోరసారించి వెర్రికేక పెట్టింది. రావిచెట్టు కొమ్మ ఒకటి జారి వసారాకు మధ్యనున్న దీపం మీద పడడంతో అది కన్ను మూసింది. అక్కడితో అంతా నిబిడాంధకారం, నిర్లిప్తత.

అంతా ఒక్క క్షణం. అంతలో మేఘగర్జనలాంటి మాటలు నిశ్శబ్దాన్ని భేదిస్తూ వినవచ్చాయి! "రా నాగభూషణం! భార్యా పిల్లల ఎడబాటు ఎలాంటిదో నీకు తెలీదు,

నువ్వు చేసిన దుష్కార్యం నా జీవితాన్ని బలిగా తీసుకొంది. ఎన్నేళ్ళుగానో నాలో గూడు కట్టుకుపోయిన పగకి నిన్ను ఆహుతి చేస్తాను" అని అరిచాడు రంగడు.

వెంటనే నిశ్శబ్దాన్ని రెండుగా చీలుస్తూ ఒక ఆర్తనాదం, గావుకేక, రోదన ధ్వని వినిపించింది. హృదయాన్ని బ్రద్దలు చేస్తూ – వెనువెంటనే వొళ్ళు ఝల్లుమనిపించేలా వికటాట్టహాసం. వసారాలో లైటు వెలిగేసరికి మళ్ళీ అంతా నిశ్శబ్దమై పోయింది. గుమాస్తా ప్రాణాలు అరిచేతుల్లో పట్టుకొని తుఫానులో గడ్డిపరకలా అల్లల్లాడిపోతున్నాడు. ఆ గుడ్డి వెలుగులో ఆ వసారాలోకి మూడు విగ్రహాలు వచ్చాయి. రంగడి బాకునుంచి రక్తపు బొట్లు టపటపా కన్నీటిబొట్టులాగ రాలుతున్నాయి.

"నా పని పూర్తయింది గుమాస్తాగారూ! నాగభూషణం అంతమయాడు. చూశారా ఈ రక్తపుబొట్లు. ఎన్నో పాపాలు చేసి మకిలిపడిన అతని శరీరాన్ని కూడా చూడాలనుకుంటే చూడండి" అంటూ చేతిలోని కళేబరాన్ని నేలనపడేసి బలంగా ఒక్కతన్ను తన్నాడు.

ఆ మృతకళేబరం గుమాస్తా కాళ్ళ దగ్గరికి వచ్చి ఆగింది. అతని శరీరంలో ప్రాణం లేదు. వొంగి దీపాన్ని ఆ చచ్చిన వ్యక్తి ముఖం దగ్గరగా పెట్టి చూశాడు. వెంటనే సర్పదష్టుడిలా లేచి నిలబడ్డాడు. తల తిరిగి పోయింది. వెర్రి చూపులు చూశాడు. ఆగి ఆగి మాటలు అన్నాడు.

"ఎంతపని చేశారండి? చేతులారా కొడుకుని హత్య చేసుకొన్నారు!"

ఇప్పుడు మూడో విగ్రహం కదిలింది. నాగభూషణం గుడ్ల నీరు కక్కుకొంటూ 'క్షమించమని' రంగడి కాళ్ళమీద పడ్డాడు.

కాని ఇదంతా వినే స్థితిలో లేడు రంగడు!

---